# శాసనసభ తొలి సమావేశం

"వెంపో"

ప్రజాఉద్యమంగా యేసమస్యను రూపొందించకుండా అభ్యుదయపక్షాలు శాసనసభల్లో యెంతవాదించినా కడకు స్టేటును చేతులోపెట్టుకొన్నవారిదే విజయమౌతుందన్న చారిత్రకసత్యం అక్షరాల ఆంధ్రరాజధానివిషయంలో రుజువైంది. నవంబరు 23 సమీపించినకొద్దీ ఆంధ్రభూమిపై వీచిన ప్రచండఝంఝామారుతం తృటిపాటులో నిస్తబ్దమైంది. సమస్యమాత్రం వేసినచోటునే ఉండిపోయింది. దీనికి ముఖ్యమైన కారణం వివిధ రాజకీయ పార్టీలు రాజధానిసమస్యను కేవలం పార్టీప్రయోజనాలకి, పదవీవ్యామోహాలకి దురుపయోగం చేసికొనుటయే! ఈ విషయం మొన్నటి ఆంధ్ర అసెంబ్లీ సమావేశాలలో బాగా స్పష్టమైంది. శ్రీ సంజీవరెడ్డిగారిప్రకటన ప్రకారం నిజంగానే శ్రీబాగ్ పేక్ట్‌పై ఆయనకు అచంచల విశ్వాసం వున్నదని విశ్వసించి చివరకు సత్యాగ్రహాలకుకూడా సమాయత్తమైన కర్నూలుజిల్లా కాంగ్రెసు నేతృత్వం ఆయనను విశాఖపైగల మోజును తెలిసికొనటంతో టే ఆశాభంగం పొందింది. చివరకు సంజీవరెడ్డిగారిని నమ్మకొని శాసనసభాసభ్యత్వాలకు రాజీనామాల నివ్వడానికి సన్నద్ధపడ్డ రాయలసీమశాసనసభ్యులకు ముఖ్యంగా కాంగ్రెసేతరులకుకూడా విభ్రాంతి కలిగించింది. శ్రీబాగు ఒడంబడికను శ్రీ సంజీవరెడ్డిగారు ఒక స్టేజివరకు తెలివిగా వుపయోగించుకొని దాని ద్వారా కర్నూలులో ఉద్రిక్తతను, రాయలసీమ శాసనసభ్యుల రాజీనామాల బెదరింపును సృష్టించి రెండవస్టేజిలో రాయలసీమనంతనూ మోసగించి విశాఖలో యెగిరి గంతేశారు. దీనివల్ల మన కాంగ్రెసు నాయకత్వపు విలువలను లెక్కగట్టవచ్చు. అదేవిధంగా కృషికొలోక్ పార్టీ వింతవింత వైఖరులుకూడా ఈ సమావేశంలోనే బహిరంగమయ్యాయి.

శ్రీ పి. వి. జి. రాజుగారి నామమాత్రపు గ్రూపుకూడా అదెలాంటిదైనా చక్కని రాజకీజ్ఞతను ప్రదర్శించిందనే చెప్పాలి. గవర్నరు ప్రసంగంపై వచ్చిన సవరణలన్నిటినీ అందరూ ఉపసంహరించుకొంటే ప్రభుత్వానికి విశాఖపై గల మోజును కనిపెట్టి ఆయనమాత్రం ఉపసంహరించుకుండా ఆయన కోరుకున్న ఓటమినిపొందాడు. అనధికారదినంనాడు విశాఖపట్టణం చర్చకువచ్చినప్పుడు అడ్డురాకుండా తటస్థుడుగా వున్నాడు. ఈ దెబ్బవల్ల ఆయనకు మూడు ఫలితాలు ఊడిపడినాయి. ఒకటి తన విశాఖజిల్లాపై అభిమానం ఉందని రుజువుపరచుకోవటం. రెండు తన పార్టీ తీర్మానంప్రకారం గుంటూరు - విజయవాడలపై మొక్కుబడి చెల్లింపు. మూడోది కాంగ్రెసుతో లాలోచీ అయ్యి ప్రతిపక్షాలు ముఖ్యంగా కమ్యూనిస్టులు గవర్నరు ప్రసంగంపై తమ సవరణలు ఉపసంహరించుకొన్నారని దెబ్బతియ్యటం. ఇది రాజకీయజ్ఞతకాక మరేమంటారు?

కాగా కమ్యూనిస్టులకు గవర్నమెంటు రద్దయిపోతే తన పార్టీ సభ్యులలో తీవ్రమయిన నిరుద్యోగ సమస్య యెదుర్కోవాలనే బాధ ప్రస్ఫుటమై అనధికార దినానికి రాజీయైయారు. గవర్నరు ప్రసంగంపై శ్రీ పి. వి. జి. రాజుగారి సవరణకు అనుకూలంగా (గడువులో తేడావున్నా సర్దుకొని) ఓటుచేస్తే, ఆ ఖ్యాతి పి. యస్. పి.కి పోతుందనే భయం వుండనే వుంటుంది. ఏది యెట్లయినా గవర్నరు ప్రసంగంపై సవరణగా గుంటూరు-విజయవాడలకు కలిసి వోటు చేయటానికి అనేకులకు నిరుద్యోగ సమస్యయే అడ్డొచ్చింది. అందులో రాజధానిసమస్య వచ్చే జనరల్ ఎన్నికల దృష్ట్యా యేఒక్కరికి అనుకూలంగా పరిష్కారం కావటానికి ఏ రాజకీయపక్షానికి ఇష్టం లేదనేది అసలు ముఖ్యం.

ఇక అనధికార దినంనాడు చర్చించాల్సిన అనేక తీర్మానాలను చూస్తే కూడా మన శాసనసభ్యులకు రాజ్యాంగ వ్యవహారాలు బొత్తిగా తెలియవనైనా అనుకోవాలి. లేకపోతే సమస్య


ఒక కొలిక్కి రావటం యిష్టంలేదనైనా అనుకోవాలి. మన స్పీకరు చెప్పిన మాటలు గమనిస్తే యీ విషయం బోధపడుతుంది: "నేనేమి చేయగలను. సభ్యులు సవరణలు ప్రతిపాదించటంలో ఒక పద్ధతి అంటూ లేకుండాపోయిన ఫలితమే యిది." కాగా అసెంబ్లీలో జరిగిన వాస్తవ విషయాలు పరిశీలిస్తే మన ప్రజానిధులు యెంతటి పరిపాలనా దీక్షలో కూడా మనం తెలిసికోవచ్చు.

శ్రీలుకలాపు లక్ష్మణదాసుగారి ప్రధాన తీర్మానం శ్రీ రొక్కం లక్ష్మీ నరసింహంగారి స్వల్ప సవరణతో నెగ్గింది, తర్జనభర్జనలతర్వాత శ్రీ తమ్మిన పోతరాజుగారి సవరణ 1954 ఏప్రిల్ 1వ తేదీన మద్రాసులోని ఆంధ్ర ప్రభుత్వ కార్యాలయాలను గుంటూరు-విజయవాడలకు తరలించాలని కూడా సభవారు ఆమోదించారు. తొమ్మిది గంటల దీర్ఘకాలంవినియోగించినమీదట జరిగిందేమిటంటే రాజధాని విశాఖలోను, ఆఫీసులు గుంటూరు—విజయవాడలలోనూ అని. ఇది యెంత హాస్యాస్పదమో వేరే వ్యాఖ్యానించపనిలేదు. ఇంతపనీ జరిగినమీదట స్పీకరు ప్రధానతీర్మానంతో కలిపి సవరణలను కూడా చదివి అసెంబ్లీ ఆమోదాన్ని లాంఛనంగా కోరగా ఆ తీర్మానంలో ఒకవర్గం వారికి యిష్టంలేని విశాఖకు రాజధాని మార్చాలని వుండటం వల్లనూ ప్రభుత్వ పక్షానికి యిష్టంలేని గుంటూరు-విజయవాడలకు ఆఫీసులు తరలింపు ఉండటంవల్లనూ ఉభయ పక్షాలూ అనాలోచితంగా ఉద్రేకంతో "లేదు" అనటం జరిగింది. ఈ అనటంవల్ల యే ఒక్క పక్షమూ మొత్తం తీర్మానం రద్దవుతుందని గాని తమకే ఉపకారం జరుగుతుందని గాని ఊహించిమాత్రం చేయలేదు. ఇది కేవలం ఉద్రేకం, అనాలోచితం, పార్లమెంటరీ వ్యవహారదక్షత లేని కారణంగామాత్రమే జరిగిందని స్పీకర్ మొత్తం తీర్మానం రద్దయిందని ప్రకటించినప్పుడు సభ్యులు పొందిన నివ్వెరపాటే ప్రత్యక్షసాక్ష్యమిస్తుంది. ఇది మన ప్రజా ప్రతినిధుల వ్యవహార దక్షత. గంటలకొలదీ పరస్పర నిందారోపణలతో పొద్దుపుచ్చే మన శాసనసభ్యులకు పార్లమెంటరీ రూల్సు తెలిసికొనే తీరుబడి యెక్కడ వుంటుంది చెప్పండి?

ఏది యెట్లయినా మొన్నటి మన అసెంబ్లీ సమావేశంలో వివిధపార్టీల రంగులు స్పష్టమైనాయి. అయినా వివిధపార్టీలు తమ తెలివితక్కువతనాన్ని గుప్తపరచుకొనటానికి ప్రస్తుతమవలంబించే విధానమే మనల్నెక్కువ చీకాకు పరుస్తుంది. కాంగ్రెసువారి కుట్రలను భగ్నం చేశామని కమ్యూనిస్టులు, ప్రతిపక్షాలను నిర్జించామని ప్రభుత్వమూ జబ్బలు చరుస్తున్నాయి. రాష్ట్రనిర్మాణంగాని ఆంధ్రరాజధానీ నగర నిర్ణయముగాని యే రాజకీయపార్టీ శ్రమ విలువ కాదు. ఒకటి ఆంధ్రవీరుని బలిదానం పర్యవసానంగా ప్రాప్తిస్తే మరొకటి ఆంధ్ర ప్రజాప్రతినిధుల తెలివితక్కువ తనంవల్ల సిద్ధించింది. కాగా దీనివల్ల ఆంధ్రాభ్యుదయంకూడా యే ఒక్క రాజకీయపార్టీ ప్రసాదించేది మాత్రంకాదని విదితమయింది.

ఇంకా మన ప్రజాప్రతినిధుల ప్రజలపట్ల ఆదరణ రుజువుకావటానికి శ్రీ వావిలాల వారి జీతాలకోత తీర్మానంపై చర్చలవైఖరి చాలు. ఐతే ఈ సవరణవల్ల ప్రజలకు మేలేకల్గినా అసెంబ్లీలో జరిగిన సంఘటన తెలిసికోవటం ప్రధానం. రోజుకి 12-8-0 భత్యం 150 రూ నెలజీతం రైలుఖర్చులుయిచ్చి మనకు ప్రాతినిధ్యం వహించమని శాసనసభ్యుల్ని పంపిస్తే బలవంతం బ్రాహ్మణార్థంగా అసెంబ్లీలో కాసేపు కూర్చుని ఆ తర్వాత షికారులకు బయలుదేరుతారు. ప్రధానమైన మంత్రుల జీతాలను గురించి చర్చజరుగుతోంటే ప్రభుత్వపక్షంలోని శాసనసభ్యులు చాలావరకు షికారుకు పోయారు. తీరా సవరణ ఓటింగునకు వచ్చింది. సంజీవరెడ్డిగారికి గంగవెర్రులెత్తింది. కారుపంపించి యెక్కడ తిరుగుతున్నారో ప్రభుత్వ యం. యల్. ఏ. లను పట్టుకొని రమ్మని కబురువెళ్ళింది. అయినా ఫలితం లేకపోయింది. ఇలాంటి ప్రజా ప్రాతినిధ్యాన్నుంచి ఆంధ్రప్రజానీకం విముక్తి చెంది వచ్చే జనరల్ యెన్నికలలోనైనా పార్టీ, కుల, మత, వర్గ భేదాలకు అతీతమైన అసెంబ్లీ వాతావరణాన్ని సృష్టించుకోవటం ఈ గుణపాఠాల విలువగా గుర్తించాలి.

★



# మనిషి - చీకటి

కథానిక

మైక్ ముందు నిలబడి పెద్దగందరగోళం మధ్య — ఉపన్యసిస్తున్నాను. "రికార్డో, మాల్థస్ గొప్ప శత్రువులు—సాహిత్యరంగంలో..అయితేనేం, వాస్తవికజీవితంలో వాళ్లు గొప్ప స్నేహితులు..."

ఆ గోల అంతా సమసిపోయినట్లుంది..పకపక నవ్వుమాత్రం వినిపించింది. తెల్లబోయాను. గొప్ప లెక్చర్ ఇస్తోంటే—

"లే బ్రదర్— లే! పగటినిద్రలోకూడా వీళ్ళేనా!" అంటూ తట్టాడు మూర్తి.

తెలివొచ్చింది. నాలుగైందిలా ఉంది.

"ఏమిటి?" అన్నాను వాడినవ్వు చూసి.

"ఏంలేదులే...నీకు రికార్డో, మాల్థస్ తప్ప ప్రపంచం లేనట్లుంది...ఇంకలే" అన్నాడు.

లేచాను. కల— పాడుకల. చదూతూన్న పుస్తకం వాడు చూడకుండా దానిమీద దుప్పటీ పడేస్తూ, "ఫుల్ గా మేకప్ అయివొచ్చావు" అన్నాను ఏదో అనాలని.

"ఊఁ...ఇవాళ బయటికి వెళ్దామని అనుకుంటున్నాను. తమతో ఉదయం మనవి చేసుకున్నాను..." వాడు కొంచెం సీరియస్ పోజు పెట్టి అన్నాడు.

త్వరగా ముఖంకడుక్కుని తయారయాను.

"నిద్రముఖం పోలేదు—" అన్నాడు మూర్తి.

"పోతుందిలే కాఫీ తాగాక. పద" అన్నాను.

నిశ్శబ్దంగా వాడు బయలుదేరాడు. నేనూ నెమ్మదిగా మెట్లు దిగుతూ ఆలోచనలో పడ్డాను.

కాఫీహౌస్ కి పోయేదాకా ఎవళ్ళం మాట్లాడలేదు. కూర్చుని కాఫీకి ఆర్డరిచ్చి, "చదవడం ఎందుకనిరా?" అని అడిగాడు మూర్తి.

ఈ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ వొచ్చే ప్రశ్న రమనిగురించితప్ప ఇలా ఉంటుందని నేననుకోలేదు. ఇంత సీరియస్ గా వాడు అడగడమూకొత్తే.

"ఏమిటీ నువ్వడిగేది?" అన్నాను.

అక్కడ గ్రౌండ్ లో హాకీ ఆడుతున్నారు. టౌన్ నించి టీమ్ వొచ్చినట్లుంది. అదిచూస్తున్న వాడల్లా పూర్తిగా నావైపు తిరిగి, "ఈ చదువులూ ఎందుకనిరా?" అన్నాడు మూర్తిమళ్ళా.

నాకు జవాబివ్వాలనిలేదు. వాడు చిత్రమైన మనిషి - ఆ ప్రశ్న బుద్ధిలేనిది అనిపించింది. సెర్వరు కాఫీ తెచ్చాడు. నేను దూరంగా చూస్తూ కాఫీ తాగుతున్నాను.

నీకు పెద్ద ఏంబిషన్ - ఆ క్లబ్బులో ఎన్నటికైనా పెద్ద ప్రామినెంట్ మెంబర్ ఆవాలని... కాదూ?"

సూటిగా అడిగాడీసారి. నాచూపు ఫేకల్టీ క్లబ్ మీద ఉన్నమాట నిజమే. కాని—

"కాదు—" అన్నాను.

"మరి?"

"ఆ బిల్డింగూ, ఆ వెనక చెట్లూ చూస్తూ కూర్చుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది" అన్నాడు వాడు.

"నిజం— ఆ క్లబ్బు అంత అందంగానూ ఉంటుంది. కాని మనకళ్ళముందు ఇంకాఅందాలు ఉన్నాయి- చూడూ...ఆ డ్రైవ్...అదిగో...గోల్...ఛా—పాపం మిస్ అయాడు..."

"గేమ్ బాగానే ఉందిలే—" అన్నాను.

"అంతే—ఎప్పుడూ ఉండే క్లబ్బు నాకు అన్ని అందాలతోనూ ప్రత్యక్షం అవుతుందిగాని, మరో

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

అరగంటలో పూర్తిఅయే, ఇంతచక్కటి గేమ్-"

ఊరుకున్నాడు. ప్రక్కన కూర్చున్నవాళ్లు అమ్మాయిలు....

త్వరగా కాఫీ ముగించాం. బిల్ రాదు... ఎప్పుడూ అరగంట దానికోసమే ఎదురుచూడాలి.

టేబిల్ మీద చిల్లరఉంచి లేచాము. తొందరగా మెట్లుదిగుతూ, "ఇవాళ లేడీస్ ఇక్కడికి వచ్చారేం?" అన్నాడు మూర్తి.

"ఏదోఫంక్షన్ ఉందిగా? పదిమందీఉన్నారు"

"మనకి ఎడ్యుకేషన్ ఎప్పటికొస్తుందిరా?"

విచిత్రంగా అన్నాడు. ఊరుకున్నాను. సైన్సుకాలేజీముందు రిక్షావాడు నిలబడి టవర్ క్లాక్ వైపు దీక్షగా చూస్తున్నాడు.

"ఏమిటి చూస్తున్నావ్?"

తృళ్ళిపడి వాడు మా వైపుతిరిగి "టౌనుకి వొస్తారా బాబూ?" అన్నాడు.

"వొస్తాంలే—నీ రిక్షా ఎక్కితీరుతాంకూడా. కాని, ఏమిటి చూస్తున్నావు?" అన్నాడుమూర్తి రెట్టించి.

"ఏమీలేదు బాబూ..."

నసిగాడు రిక్షావాడు.

"చెప్తానంటే ఎక్కుతాము—లేకపోతే బస్ మీద వెళ్తాము" అన్నాడు మూర్తి.

"చెప్తాను బాబూ"

ఎగిరి కూర్చున్నాడు రిక్షావాడు సీటుమీద. మేమూ నెమ్మదిగా సర్దుకున్నాము.

ఔట్ గేట్ దాటి, నెమ్మదిగా దారిపట్టింది రిక్షా. సైకిలు తొక్కుతూన్న శబ్దం లయిబద్ధంగా వొస్తూంది. రిక్షావాడూ క్రమంగా ఊపిరి చిక్కన చేస్తున్నాడు.

"చెప్పు..."

"ఆ గడియారం బాబు ... అంత పెద్దది ఉంటుంది...ఆ ముళ్లుతిరగడం కనిపిస్తుందండి... ఏమి వింతగా ఉంటుంది... ఈ కాలేజీలకీ మీ మేడలకీ - అన్నిటికీ రాజాలా ఉంటుంది-"

ఆగి ఊపిరి తీసుకున్నాడు వాడు.

"ఊఁ..."

"కిందటి ఆ మారాజు విగ్రహం ఉందికాదు బాబూ...చుట్టూ పాలరాతిచప్టా...ఆ విగ్రహం"

ఆగాడు వాడు.

"ఊఁ..."

"ఆ గడియారంతో పోటీచేస్తూన్నట్లుంటుందండి"

"మరి—?"

"అదేనండి...కిందనించి మారాజు ఏదో సెప్తూంటే ఆ గడియారం ఇనకుండా తనపని చూసుకుంటూన్నట్లు"

"అదే చూస్తావా?"

"అవునండి...ఆ మొక్కలమధ్య ఆ చప్టా మీద ఆ మారాజు విగ్రహం, ఎనకాల ఆగకుండా పెద్దరాజాలా గడియారం...పోటీలా...ఎలాగో ఉంటుందండి."

అలసిపొయ్యాడువాడు.రోటరీ అవ్ వొచ్చింది. తరుచు అక్కడ దిగేవాళ్ళం—రిక్షాలోవస్తే.

"దిగుదామా?" అన్నాను.

"వొద్దు" అన్నాడు వాడు.

రిక్షావాడు దిగి నడిపించసాగాడు. స్పెన్సర్ దాకా వొచ్చేసరికి వొళ్ళంతా చెమటపోసింది—గాలితీత్తి అయిపొయ్యాడు. పెద్ద దయామయుడిలా పోజువేసే మూర్తి అంత నిర్దయగా ఎందుకు కూర్చున్నాడో...

స్పెన్సర్ వొచ్చింది—ఇంక అంతా డౌనే—ఆ విషయం ఓసారి మననం చేసుకున్నాడు రిక్షావాడు.

సిటీబస్ మమ్మల్ని తప్పించుకువెళ్ళింది. ఆరే! అనుకున్నాను. బయటికనలేదు.

"అందులో పోవాల్సింది" అన్నాడుమూర్తి.

"అవును .." అన్నాను.

వాడు విచారంగా నవ్వాడు. "మనం చదువుకోడం ఎందుకనిరా?" అన్నాడు—మళ్ళా,

"ఉద్యోగాల కోసం—"

"ప్రతి ఉద్యోగీ ఆనర్స్ గ్రాడ్యుయేటా?—ప్రతీ ఆనర్స్ మనిషే ఉద్యోగా?" అన్నాడు తేలికగా.

"కొంచెం ఆశ ఉంచుకోవొచ్చుగా?"అన్నా ఇంకేమీ అనలేక.

"మనదీ చదువే అంటావా?"

"నాకు వాదించాలని లేదు—" అన్నాను. వాడినికదిపితేచాలు ప్రమాదకరంగా కనిపించింది.

"అదికాదురా... మనదీ ఓ చదువేనా

అంటున్నాను. మూడేళ్ళనుంచీ చూస్తున్నాం... ఆ టవర్ క్లాకూ, ఆ విగ్రహమూ, దానిచుట్టూ ఈ అలంకారము. ఎప్పుడూ వాటిని పొగుడుతుంటూ ఆనందించేవాళ్ళం. లేకపోతే వాటన్నిటికీ దిష్టి పిడతలా ఉండి ఏడుస్తోన్న ఆ రాడార్ ట్రక్కుని తిట్టేవాళ్ళం—దాన్ని తీసేస్తే బాగుండును అనుకునే వాళ్ళం. నీకు చూడు—"

"ఊఁ—"

"మనకన్న రెండు మెట్లు పైకెక్కాడు. వాడు ఒక్కొక్కదాన్ని చూడలేదు.... అన్నిట్నీ కలిపి చూశాడు. మనం మాశాం అనుకో—అయితే, సామాన్యంగానే..."

"వాడు చాలా గొప్పవాడంటావు!" అన్నాను వొళ్లుమండి. రిక్షావాడి పరిశీలనలో ఏదో ఘన కార్యం సాధించబడిందని అంగీకరించలేకపోయాను.

"మనదీ చదువేనా అంటాను. జీవితాన్ని తరిచి చూసినవాళ్ళకీ, పుస్తకాలని వల్లెవేసేవాళ్ళకీ అదేలే భేదం! ఇలా విషయాలని చూడమని ఆడమ్‌స్మిత్ చెప్పడు - సెంట్రల్‌లో బేంకింగులో చెప్పరు. జీవితం నుంచి నేర్చుకోవాలిలే—"

బోర్ అయినట్లు ఊరుకున్నాను. ఒక్క నిమిషము వాడూ తగ్గాడు.

రిక్షా చాలా త్వరగా వొచ్చేసింది. కాల్టెక్స్ దగ్గర దిగి హాస్పిటల్ రోడ్డు పట్టాం.

"క్రిందటివారం పార్టీకి నువ్వు రాలేదని చాల కోపంగా ఉంది రమ" అన్నాడు సంభాషణ పునః ప్రారంభిస్తూ మూర్తి!

"కొంచెం చెప్పు - గెస్ట్‌ఉన్నాడను" అన్నాను.

"పేరు అడుగుతుందే!" అన్నాడు వాడు-నవ్వుతూ.

"ఏదో ఒకటి చెప్పు..."

"ఇవాళ మనకి కొత్తకథ వినిపిస్తుందిట!"

"అదెలా తెల్సింది?"

"ఇందాకా ఫోన్ చేశాన్లే..."

"బాగానే ఉంది—"

"డ్యూ వార్నింగ్!"

ఇద్దరం నవ్వుకున్నాము. రమ చాలా చెత్తగా రాస్తుంది. బావున్నాయంటే నమ్మదు. బాగులేవంటే, జెలసీ అంటుంది.

"అవన్నీ కలిపి అచ్చు వేయిస్తుందట!"

"ఉత్తమం. ఈనాటి పత్రికల నిండా వొట్టి చెత్తకథలు-ఇంత ఉత్తమ సాహిత్యానికవి నోచుకోవు!"

"ఆమాట అంటావా?"

"గట్సులేవు-కాని—"

"నిజం!"

మళ్ళా నవ్వుకుని మళుపు తిరిగాము. రమ గార్డెన్‌లో కూర్చుని కుక్కపిల్లతో ఆడుకుంటూ వుంది. దాన్నే మా స్వాగతానికి పంపింది

"కుక్కతో ఆడుతున్నావా?" అన్నాడు మూర్తి-గేటుతోసుకెళ్ళి కుర్చీలో కూర్చుంటూ.

"ఊఁ - నువ్వొచ్చేదాకాను—" అని, నావైపు తేరిగ్గా చూస్తూ, "దారి తప్పారే!" అంది.

"క్రితంవారం మాట ఇంకామరిచిపోనట్లుంది" అన్నాను మూడో కుర్చీ అలంకరిస్తూ.

"పరీక్షలకి వెళ్ళకపోయినా, ఇలాంటివి ఐతే సులువుగా మరిచిపోం" అంది రమ.

"ఓ గెస్ట్ తగిలాడులెండి—" అన్నాను సర్దుకుని.

"అవును. మిష్టర్ అమృతరావు ఎమ్. ఏ. ఆనీ. పత్రిక పెట్టబోతున్నాడుట. వీడిని ఎడిటర్‌గా ఉండమని బ్రతిమలాడడానికి వొచ్చాడు."

చాలా సీరియస్‌గా అన్నాడు మూర్తి. నేను కష్టంగా నవ్వు ఆపి, "అందులో సగం కోతలెండి" అన్నాను.

"కాకపోతే బాగుండును-నా కథలన్నీ సులువుగా అచ్చగును-" అంది రమ.

వాళ్ళిద్దరూ క్రమంగా వ్యవహారంలో పడి వాదించుకో సాగారు. నేను మధ్యమధ్య నిద్రపోలేదన్నట్లు ఓ కామానో, ఫుల్‌స్టాపో చేయిస్తూ ఎంతవేగం ఈ బోర్‌నుంచి బయటపడతామా అని ఆలోచిస్తూ కూర్చున్నాను.

మూర్తికి ఏదో బంధువు రమ. వాళ్లు పెళ్ళి చేసుకునే ఉద్దేశం ఉందని చెప్పాడు మూర్తి. ఈ లోపుని రమని కొంత తెలుసుకోవాలని వాడి ఉద్దేశం. వాడంటే ఆవిడకి చాలా అభిమానంలాగా కనిపిస్తుంది. కాని, ఒకేలాగ బోర్ చేస్తుంది. అందుకే ఆవిడ అంటే నాకు హడల్. మనిషైతే చూడడానికి బాగుంటుంది. అందుకని

నోరు మూసుక్కూర్చోవడం. నేనూ రేగితే, గార్డెన్ అంతా ఎండిపోతుంది.

"అన్నట్టు దేవతత్తం పోయాడు తెలుసా?"

చాలా బాధగా అన్నాడు మూర్తి. నాలుగు రోజుల క్రిందట అతను పోయాడని తెలిసింది-మూర్తికేదో బంధువు. రెండురోజులు వాడు అన్నం ముట్టలేదు.

"ఎప్పుడూ?"

"సోమవారం—"

"పీడ పోయిందిలే!"

ఛెళ్లున కొట్టాడు మూర్తి. నాకు ఏం జరిగిందో తెలిసేలోపున "స్టుపిడ్!" అన్నాడు కటువుగా.

రమ తెల్లబోయింది. ఒక్కసారిలేచి, "ఏమిటా? అది? మతిపోయిందా?" అన్నాను.

"ఇంకా లేదులే-అందుకే కొంచెం ఉద్దేశం తెలియజేయాల్సి వొచ్చింది. 'పీడ'ట!"

ఆ అమ్మాయికి దెబ్బ గట్టిగా తగిలిందో, అవమానం ఎక్కువ అనిపించిందో, ఆవిడకే తెలియాలి. ముఖం కప్పుకుని ఏడ్వసాగింది.

"ఏడూ-వాడినన్న పాపం పోతుంది-పదరా."

విసురుగా లేచాడు మూర్తి.

"నీకు బుద్ధిలేదు—"

సగం మాటలోనే ఆపి, "ఇది నా వ్యక్తిగత విషయం-గౌరవం కాపాడదలుచుకుంటే, నోరు మూసుకుని నడూ" అన్నాడు మూర్తి.

నిస్పృహాయంగా నడిచాను. చీకటి పడుతోంది. కాలేజీకెదగ్గర ఏదో జట్కా ఉంది. ఎక్కి వెనక్కి బయలుదేరాం. ఎవ్వరం మాట్లాడడంలేదు. ఇన్ గేట్ లోంచి వెళ్ళడాన్న పవరు పూర్తిగా కనపడలేదు. ఏడున్నర అయింది గడియారంలో.

వెలుతురులో వాడిముఖం వంక చూశాను-చాలా కోపంగా ఉన్నాడు. మాటలాడినా, కసిరేలా ఉన్నాడు. నోరుబిగించుకుని లోపలికివెళ్ళి జట్కా దిగాం.

"త్వరగారా... నేనూ వొస్తాను. భోజనం చేసి వొద్దాం" అని, మూర్తి తన రూమ్‌కని వెళ్ళాడు.

నేను మళ్ళా నా రూమ్‌కివచ్చాను. వాడా మాట అనడం పెద్ద రిలీఫ్‌లా ఉంది.

ఒచ్చిన ఉత్తరం అరనిముషంలో చదివి పడేసి, క్రిందికి దిగాను. వాడు బట్టలు మార్చుకుని రానే వొచ్చాడు. తిన్నగా మెస్‌కి నడిచాము.

"వంటలేమీ బాగులేవు-అది క్రొత్తకాదు. టేబిల్ మురికివాసన, నేలఅంతా బురదవాసన, నీళ్లుపోసేవాళ్లు-దగ్గరికొస్తే బట్టల కుళ్లు. సర్వర్స్ చెమటవాసన..." వాస్తవికత.

"ఎవరో గట్టిగా అంటున్నారు-పాపం... అనుకున్నాను. పరిశుభ్రతకోసం ఈ హాస్టల్ మెస్‌లకి వొచ్చాడు - సాయబుని తిథి అడిగినట్లు!

నిశ్శబ్దంగానే భోంచేస్తున్నాం. వీరంటే అసహ్యం వెయ్యసాగింది-సాయంత్రం ప్రవర్తన చూశాక...ఆమె కొంచెం తొందరపడి ఉండవచ్చు-కాని, వీడి స్థయిర్యం మాత్రం ఏముందని?

"పాడుకారం! తెగపోశాడు..."

బల్లమీద గ్లాసుకొట్టాడు-నాలుగు-ఆరుసార్లు. బోయ్ ఎక్కడో ఉన్నాడు. పరిగెట్టుకొచ్చాడు. కొంచెం ఆలస్యం అయింది. దగ్గరికిరాగానే చెంప మీద ఒక్కటి తగలనిచ్చి, "ఏం చేస్తున్నావ్, ఇంతసేపు?" అన్నాడు మూర్తి.

నలుగురు సర్వర్లూ మూగారు. వాళ్ళకి ఇది క్రొత్త ఏమీలేదు. ఆలస్యం చేసినందుకు బోయ్‌ని యథాశక్తి అందరూ చీవాట్లు వేశారు.

పెరుగువేసుకని భోజనం క్లుప్తం చేశాము. త్వరగాపోయి రూములో దాకోవా లనిపించింది వీడి చర్యతో. బోయ్ ఒకసారి కళ్లు తుడుచుకుని తన పని సాగించుకుంటున్నాడు.

"చాలా గొప్పపన్లు చేసేవని కాబోలు నీ ఉద్దేశం!" అన్నాను ఇవతలకి రాగానే.

"ఈ కుళ్లు సరుకుని నెత్తి ఎక్కించుకోలేదని నీ బాధ" వికటంగా అన్నాడు వాడు.

"కాదులే. కొంచెం జ్ఞానముంటే అదేమిటో తెల్సును. చదువులెందుకో ఉపన్యసించే మహానుభావులకి ఈ మాత్రం ఇంగితం ఉండాలని అనుకుంటాను" అన్నాను కోపంగా.

"వాడిని కొట్టాననేగా నీ—"

"వాడిమాట వదిలీ-వాడు మనిషిక్రింద జమరాడు. సాయంత్రం పెద్దమగవాడిలా ఆవిడమీద చెయ్యి చేసుకున్నావ్, సారీ అనైనా అనకుండా."

"నా వ్యక్తిగత విషయాలలో జోక్యంవొద్దని మరోసారి చెప్పాలనుకుంటూను—"

ఎంత తొందరగా అన్నాడో అంత వాడిగా అన్నాడు మూర్తి. నన్ను కొట్టినట్లనిపించింది.

"సరే—థాంక్స్—"

జన్మలో వీడిముఖం చూడకూడదనుకున్నాను. నా రూమ్‌కి వెళ్ళి తలుపు వేసుకున్నాను.

సాయంత్రంనించీ జరిగినదంతా నామూలాన్నే ననిపించింది. మరుక్షణం అక్కడికి వెళ్ళకపోవాల్సిందనుకున్నాను.

కొద్దిసేపు అయాక, నా పరిస్థితి జ్ఞాపకం వొచ్చింది. మూర్తితో తగవు-వాడితో...

చేతులుపట్టుకుని నడుస్తోన్న ఇద్దరిమధ్య ఒక్కసారి వందలమైళ్ళ అగాధం వొచ్చినట్లయింది. ఏదో క్రొత్త లోకంలో ఒంటిగా...

ఏడుపువచ్చే పర్యంతం అయింది. ఇన్నాళ్ళనించి నేనూ వాడూ ఒక్కటిగా మెలిగాము. వాడి విచిత్రఉద్దేశాలకీ, పిచ్చిపనులకీ, అన్నిటికీ నేను శ్రోతగానూ, ప్రేక్షకుడిగానూ ఉండగలిగాను. ఈ ఒక్కరోజూ...

ఎందుకని నేనూ తొందరపడాలి? కొంచెం శాంతంగా బోధపరిస్తే వాడూ దారికి వొచ్చేవాడు. నేను మూర్ఖంగా తొందరపడ్డాను.

ఆలోచనలన్నీ గందరగోళంగా ఉన్నాయి. ఒకసారి వెళ్ళి వాడికి క్షమాపణ చెప్తే?

అవును... నేన చేయగలిగిన కనీసం అది. దేవదత్తం వాడిప్రాణం. అదీకాక రమతో వాడి విషయం వాస్తవంగా వ్యక్తిగతం. నా కెందుకన్నీ? స్నేహితులకీ వాళ్ళ హద్దులుండవూ? ఈ నిజంనించి నేనెందుకు తప్పించుకోచూడాలి!

కాని-అనిపించింది. ఒక ఓటమి అంగీకరిస్తున్నానేమో. నేను క్షమాపణ చెప్పినా వాడు వెటకారం చేస్తే?

అలాగే కూర్చున్నాను. ఏదో పుస్తకంతీసి చదవడం మొదలుపెట్టేను.

పదకొండు ఇంక చదువు సాగలేదు. పుస్తకం మూసి వరండామీదికి వచ్చాను. సముద్రపు హోరు చాలా గట్టిగా వినిపిస్తూంది అంతా దగ్గరికి వొచ్చేసినట్లు. చాలారూముల్లో దీపాలు వెలుగుతున్నాయి. అంతా ప్రశాంతంగామాత్రం ఉంది. పవర్‌క్లాక్ చిక్కటి చీకట్లలో పెద్ద గ్రహమల్లే మండుతోంది. ఆ రిక్షావాడు జ్ఞాపకం వచ్చాడు. ఇదంతా చూస్తే వాడేమంటాడో!

అక్కడనించి వాడి రూమువైపు చూశాను. దీపంలేదు. వాడు నిద్రపోయాడా?...ఏమో.

నాకైతే నిద్రపట్టేలాగలేదు. మళ్ళా మెట్లు దిగి, రోడ్డు పట్టేను.

నెహ్రూ సర్కిల్‌దగ్గరికి వొచ్చేసరికి అంతా ఏదో క్రొత్తగా కనిపించింది. ఆ సర్కిల్ చుట్టూ పగలంతా బస్సులూ, విద్యార్థులూ ఒకే సందడిచేస్తారు. మూడునించి అయిదుదాకా మరీని...కలకలలాడే ముఖాలూ, రంగులచీరలూ ఆ ప్రదేశాన్ని ఎంతో ఆనందంగా...

ఇప్పుడు-అంతా చీకటి టవర్‌క్లాక్ వెలుతురు కొంచెం పడుతోంది. దూరంగా దూరంగా దీపాలు బారులుగా ఉన్నాయి—అక్కడా అక్కడా చీకట్లని మాయంచేస్తూ.

కూర్చున్నాను.

ప్లేగ్రౌండూ, వెనకాల క్లబ్బూ - అంతా మసకగా కనిపిస్తున్నాయి. ఆర్ట్సు కాలేజీలో దీపాలు ఉన్నాయి. ఏదో మహాందోళనని దాచుకుంటూన్నట్లు, వెల్లివిరియబోయే కాంతిని ఆపుకుంటున్నట్లు-రహస్యం చెపుతున్నట్లుంది. బరువైన కాళ్ల స్తంభాలు రాతిమయం కట్టడం అంతా విచిత్రంగా ఉంది.

లైబ్రరీహాల్. ప్రక్కన చెట్టు. పగలంతా ఏదో ఒకవేళ చాలమంది దానిక్రింద కూర్చుని ఆలోచిస్తూనో, మాట్లాడుతూనో, కొంచెం కాలం గడుపుతారు. ఈ ఆవరణలో మరువలేని పాత్రలలో ఆ చెట్టు వొకటే. నిద్రపోతోంది అదీని.

అంత ప్రశాంతత ఎక్కడా ఏకాంతతని భంగం చెయ్యలేదు. మూర్తి!

ఒక్కసారి జ్ఞాపకం వొచ్చాడు. వాడితో స్నేహం అయిపోయిందా? మళ్ళా నాతో మాట్లాడడూ? ఒంటరిగా ఈ రోడ్లమీదా, సముద్రం వొడ్డునా- బౌనులోనూ...

ఏడుపు వచ్చింది. ఆపేదెవరూ కనిపించలేదు. కొద్ది నిముషాలలో ఆ పరిసరం అంతా మరి బాధాకరంగా కనిపించింది.

లేచి, రోడ్డు పట్టేను. గన్నేరుచెట్లమధ్య రోడ్డు నిగనిగ మెరుస్తోంది-దగ్గరికి పోగానే. నెమ్మదిగా నడిచి, సైన్సుకాలేజీ ముందుకు వెళ్ళాను.

టవర్ క్లాక్ మరీ ప్రకాశవంతంగా ఉంది. పావు తక్కువ పన్నెడయింది.

బరువుగా ఉన్న గొలుసులు పట్టుకుని, చప్టా ప్రక్క నిలబడ్డాను. ఆ విగ్రహం సన్నటి దీపాల కాంతిలో కనిపించీ కనిపించకుండా ఉంది.

గంభీరంగా, దయగా చూస్తోన్న మహారాజు, ఏదో అంటున్నాడనిపించింది. ఆ నిశ్శబ్దంలో కూడా వినిపించకుండా-ఏదో...

కాలాన్ని ఆగమనా? అందర్నీ చదువుకోమనా? తనని మరిచిపోవద్దనా?

చేతిలో పుస్తకం, ముఖాన ఏదో ఆలోచన ఉన్నన్నాళ్లు బంగారుహృదయం మనిషి. ఇప్పుడు లోహదేహం. ఏమంటున్నాడు?

నిశ్శబ్దంగా అంచున కూర్చున్నాను. కాలం గడిచిపోయింది. రాజులూ, రారాజులూ గతించిపోయారు. ఇప్పుడూ నిమేషనిమేషమూ కాలం గడిచిపోతూనే ఉంది. మళ్ళీ రాకుండా, ఈ నిముషాలూ. గంటలూ-సంవత్సరాలూ ఇలాగే గడిచిపోతాయి. మూర్తీ నేనూ దూరంగా, దూర దూరంగా, అయిపోతాము. గడిచిపోయిన ఈ చక్కటి రోజులన్నీ అలాగే స్మృతులుగా ఉండిపోయి, ఏడిపిస్తాయి.

నైరాశ్యం, శూన్యం అవరించాయి మళ్ళా. చుట్టూ వలయాకారంగా వేసిన మొక్కలన్నీ నిద్రపోతున్నాయి. కళ్ళు మూసుకుని గొలుసుకి జారబడ్డాను.

గడియారం పన్నెండు కొట్టింది. రూముకి పోదామని లేచాను. ఆ ప్రశాంతతలోనూ, ఆ చీకట్లలోనూ, ఆ విగ్రహాన్ని వదిలిపోవాలనిపించలేదు. కాని, లేచాను. రోడ్డువెంబడి తల వంచుకుని నడుస్తున్నాను.

గన్నేరుచెట్ల మధ్యనించి రోడ్డు ఇందాకటికన్నా నల్లబడిందేమో ననిపించింది. బ్లాక్స్‌లో దీపాలు చాలావరకూ ఆగిపోయాయి. మూడో ప్లాట్స్‌లోనే అక్కడక్కడా, నెహ్రూ సర్కిల్ దగ్గరికి వచ్చేశాను. ఎవరో దానిమీద కూర్చున్నారు. మూర్తీ ... ఏమో... దగ్గరగా వెళ్ళాను.

ఏడుస్తూ ముఖం కప్పుకుని కూర్చున్నాడు మూర్తి. ఆ చీకటీ, ప్రశాంతతా అన్నీ యేదో దుఃఖంతో ఉన్నట్లనిపించింది ఒక్కసారి. త్వరగా వెళ్ళి "మూర్తీ!" అని పిలిచాను-కొంచెం గట్టిగా.

వాడు తెల్లబోయాడు. "నువ్వా!—ఎలా తెలిసింది?" అన్నాడు.

"తెలిసిందిలే" అని, "ఇదేమిటి?" అన్నాను.

వాడు కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇవాళ-చాలా తప్పులుచేశానురా"అన్నాడు

వింటున్నాను.

"సాయంత్రం రమని మూర్ఖంగా కొట్టాను. నువ్వు ఊరుకుంటే బాగుండేది. ఏదో అన్నావు తప్పుచేశాక, ఆ ఓటమిలో కోపంఅంతా మెస్‌లో మళ్ళా...మళ్ళా నువ్వు అదే తప్పుచేశావు. నిన్నూ తిట్టానూ—"

"తరవాత."

"ఒక తప్పుని దాచుకోడానికి మరొకటి—దాన్ని కప్పిపుచ్చుకోడానికి ఇంకోటీ. రూమ్‌లో ఏం తోచక, ఇలా వచ్చాను. ఈ చీకటీ, ప్రశాంతతా నా తలని బాగుచేశాయి. ఇనపతెరల వెనకాల దాచుకున్న ఈ నిజాలని బయటికి తీసుకొచ్చాయి."

వింటున్నాను ఏం జవాబివ్వాలో తెలీలేదు-

"నీకు క్షమాపణ చెప్తానురా, ముందర."

నవ్వు వచ్చింది-మనస్సుని బరువైన మేఘాలవలె ఆవరించుకున్న ఆర్ద్రతనీ, అభిమానాన్నీ, మెరపుతీవల్లే చీల్చుకుని,

"ఒరే! నాటకం రిహార్సిల్‌లా ఉంటుంది. నోరు మూసుకో" అన్నాను. వాడు కొంచెం తేలికపడ్డాడు. "నువ్వు చాలా దెబ్బతిన్నావనుకున్నాను" అన్నాడు.

"అది అలా ఉంచి రమ మాట ఆలోచించావ్?" అన్నాను మనస్సులో ఉంచుకోలేక.

"ఫోన్‌చేశాను" అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ. తేలికపడేలా నవ్వాను. ఇద్దరమూ నవ్వుకున్నాము.

"రేపు మెస్ బోయ్‌కి సినిమా డబ్బులివ్వరా-నే నిమ్మన్నానని" కొంచెం ఊరుకుని అన్నాడు.

"నువ్వు చాలా చెడ్డవాడివో, మంచివాడివో తెలీదురా!" అన్నాను జవాబుగా.

"పిచ్చివాణ్ణేమో ననిపిస్తుంది. అయితే నువ్వేమంటావు?" అన్నాడు.

"మానవుడివి" అన్నాను.

లేచి రూముకి బయలుదేరాము.

ఉదయం ఆరున్నర అయేసరికి మూర్తి రూముకి వచ్చి నిద్రలేపి, "లేరా! రాత్రి తిండి లేదు. పోయి కాఫీహౌస్‌లో బాధతీర్చుకుందాం" అన్నాడు.

వాడు మామూలుగా అయాడు. ఎప్పటిలాగే నేనెందుకో సిగ్గుపడా లనిపించింది. నెహ్రూ సర్కిల్ దగ్గరికి వెళ్ళేసరికి రాత్రి కథ అంతా జ్ఞాపకం వచ్చింది. ఆగాను.

వాడు త్వరగా నడిచి, కాఫీహౌస్‌వైపు తొందరగా నడుస్తున్నాడు. ఉదయపు లేత ఎండలో ఏదో క్రొత్తగా-ఏమీ జరగనట్లే కనిపిస్తున్నాయి.

ఒక్కసారి మనసులో అందతా మెదిలింది. ఆ చీకటే. ప్రశాంతతా, కన్నీళ్ళూ, విగ్రహమూ.

"రారా. ఏమిటి చూస్తున్నావ్? ఆ చెట్టు నీకు ప్రియురాలల్లే ఉంది. ఇల్లే అయిపోతుంది మళ్ళా రా!"

ముందుకు నడిచాను. వరండాలో కుర్చీల్లో కూర్చున్నాము. దూరంగా ఎర్క్సన్ కాలేజీ వైపు చూస్తున్నాను.

"ఫేకల్టీక్లబ్ చూశావ్? ఇవాళ యెంత అందంగా ఉందో!"

మూర్తి క్లబ్‌వైపు చూస్తు అంటున్నాడు.

ఆ క్షణంలో వాడి అర్థం బోధపడింది.

---

కథానిక

# చేతులెత్తిన ప్రజాస్వామ్యం

రహీంషా

పరంధామయ్యగారు పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగిరీకి పోటీ చేయబోతూన్నారన్న వార్త గుప్పుమనగానే ఉల్లిపాలెంలో అణువుబాంబు పేలినంత పనయింది!

పార్లమెంటుకు పోటీ చేసిన (డిపాజిట్టు వచ్చిందా రాలేదాన్న విషయం వేరు!) పరంధామయ్యగారు అవ్వ! పంచాయతీబోర్డుకు నుంచోటమేమిటని జనం ముక్కుమీద వేలేసుకొని గుడ్లు మిటకరించారు! అందులో నారాయణ ముఠా వాళ్ళకు ముక్కుమీదగాదు మూతిమీదే కొట్టినట్టయింది!

పార్లమెంటు ఎలక్షన్లనాటి దగ్గర్నుంచీ నారాయణకు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు ఆశ చూపి పరంధామయ్య తన పబ్బం గడిపేస్తూ వచ్చాడు. నిన్నగాక మొన్న పార్టీకమిటీ ఎన్నికల్లోగూడా నారాయణ్ణే మన కాబోయే ప్రెసిడెంటని వుబకేశాడు. కాని యీ నిర్ణయం నారాయణ్ణి వెనక్కుతిరగమని నడ్డి విరగొట్టినట్టయింది.

షావుకారు పరంధామయ్య అండతో యీ సారి పంచాయతీబోర్డు ప్రెసిడెంటు తప్పక అవుతాననుకొన్న నారాయణ అప్పుడే ప్రెసిడెంటు అయిపోయినట్టు నడ్డి విరుచుకొని, అదే లేండి రొమ్ము విరుచుకొని తిరగడం మొదలు పెట్టాడు. మొదట్లో "ఏం పెసరట్టూ?" అని ఎగతాళిగా పిలిచిన జనం, యిప్పుడు "ఏం ప్రెసిడెంటూ?" అని పిలిస్తేనేగాని వినపడకుండా పోయింది నారాయణకు. ఐతే, పరంధామయ్య ప్రెసిడెంటు పదవికి తనే నుంచునే ప్రయత్నంలో వున్నాడనే సరికి నారాయణకి నడుములు జారిపోయినై. పిచ్చెత్తిన కుక్కలా నారాయణ బజార్నపడ్డాడు పరంధామయ్యను పేరు పరసలు పెట్టి తిట్టూ.

పరంధామయ్య మనుషులు నారాయణ నోటిమీద కొట్టేదాకా వచ్చేసరికి, చప్పున తగ్గి నారాయణ సందుదోవన పడ్డాడు కులం వాళ్ళ వోట్లు అడుక్కుంటూ.

పరంధామయ్య అలా అకస్మాత్తుగా తన నిర్ణయాన్ని మార్చుకోటానికూడా చాలా